# ప్రయాణం

శ్రీ ఆకుండి నారాయణమూర్తి

“తమరెంతదాకా వెళుతున్నారండీ?” అని మొదటమా రడిగేసరికి రమేశం వినిపించుకోలేదు. మళ్లీ రెండోమా రడిగే సరికివాస్తవిక జగత్తులోకి వచ్చి, “నేనాండి?” అన్నాడా అడిగిన వ్యక్తికేసి చూస్తూ!...

—“ఔనండి!... తమరినే అడుగుతున్నా.” అన్నాడావ్యక్తి కొంచెం కొంచెంగా నవ్వుతూ.

ఏమని సమాధానం చెప్పాలో తోచింది కాదు రమేశానికి. తనప్రయాణానికి ఓ గమ్యస్థానం అంటూ ఉంగా లే ఫలానాదగ్గరకని చెప్పడానికి!... కానీ, ఎదుట నిలబడి అంతటి పెద్దమనిషి అడుగుతూఉంటే ఏదో ఓ సమాధానం చెప్పకపోతే ఎలా?...కనీసం మరోవిషయంగురించయినా మాట్లాడకపోతే ఏం బాగుంటుంది?—“సరేగానీ, తమ పేరు?” అని అడిగేడు ఆయన అడిగిన దానికి సమాధానం ఇవ్వడం మానేసి.

‘ఇదేమిట్రా అడిగిన ప్రశ్నకు సమాధానం ఇవ్వడం మానేసి, ఇలా అనవసర బాతాఖానీ కొట్టబోతున్నాడీయన’ అని ఆ వ్యక్తి మనస్సులో కొంచెం చికాకు చెందేడు. తన పేరు చెప్పి, అతనిపేరు కనుక్కొని అలా అనవసర సంభాషణలతో కాలక్షేపం చెయ్యడం కాదతని ఉద్దేశ్యం!... అత నెక్కడికి వెళ్తాడో ఆవిషయం ఒక్కటి తెలుస్తే చాలు. అంతే!—అప్పటి కప్పుడే ఓ పావుగంట సేపయి నిల్చున్నాడు కంపార్టుమెంటులో కూర్చుందికి జాగా లేకపోడంచేత!—ఆ ప్రక్క స్టేషనులో గానీ, లేక మరి రెండు మూడు స్టేషనులలోపున ఎవరయినా దిగిపోయేవా ళ్లుంటే, తను ఆస్థలంలో కూర్చో వచ్చుకదా అనే ఉద్దేశ్యంచేత ఆ వరసలో నున్న వాళ్లందరినీ అడిగి నిరాశ చెంది, ఆఖరికి చిన్న ఆశ ఉండబట్టి రమేశాన్ని కూడా ఆ ఉద్దేశ్యంతోనే “ఎంతదాకా వెళుతున్నా”రని అడిగేడు. తను అడిగిన ప్రశ్నకు సమాధానం ఇవ్వడం మానేసి, “మీపేరేమిటని?” రమేశం తిరిగి ప్రశ్నించడంవల్ల చాలా విసుక్కున్నాడావ్యక్తి. కానీ ఓ తసు మనిషి పేరు చెప్పమన్నప్పుడు విసుక్కోవడం అంత మంచి పనికాదని, “రంగనాథం” అని చెప్పేడు. “ఇంతకీ తమ రెంతవరకూ వెళుతున్నారో చెప్పేరుకాదు.” అని మళ్ళీ అన్నాడు.

ఇలా పీడలా పట్టుకున్నాడేమిట్రా, అని అనుకున్నాడురమేశం. నిజానికి తన ప్రయాణ విషయమై తనకు నిశ్చయంగా తెలుస్తేగా చెప్పడానికి? అప్పటి పరిస్థితి తప్పించుకోడంకోసం ఓ అబద్ధమాడక తప్పింది కాదు—“అబ్బే! ఏదో తీర్థయాత్రలు చేద్దామనే ఉద్దేశ్యం కలిగింది!...ఇప్పుడు తిన్నగా కాశీ వెళ్లి, అక్కడనుంచి, అలా తక్కిన పుణ్యక్షేత్రాలకు బయలు దేరుదామని ఉంది” అని కమ్మటి అబదం ఆడేసేడు. అంత గమ్మత్తయినఅబద్ధం చెప్పినందుకు తననుతానే అభినందించుకున్నాడు రమేశం.

రంగనాథానికి నిరాశ అయింది. చాలా మంది నడిగేడు. పదికాదు కదా ఇరవై కాదు కదా రెండు వందల మైళ్ల లోపుగానయినా దిగేవారు కనిపించలేదు. ఇక రమేశం ప్రక్కనున్న ఆ స్త్రీ అతనికంట పడింది. చిన్న ఆశ జనించింది. ఆమె నడుగుతే బాగుండుననుకున్నాడు. కానీ ఆమె రమేశంతో వస్తున్నదేమో అనే అనుమానంవల్ల, “ఆమె మీతాలూకావినాండి?” అని రమేశాన్ని తట్టేసరికి, “ఆ! ఔనండీ” అని అన్నాడు రమేశం కొంచెం చిరాకుతో!

“ఏమవుతారండీ?” అని మళ్ళీ ప్రశ్న వేసేడు రంగనాథం.

ఆ ప్రశ్నతో రంగనాథంమీద చాలా కోపం వచ్చింది రమేశానికి!...తన విషయమై మహా అవసర మున్నవాడిలా అలా అడుగుతాడేమా అని చాలా చికాకేసింది.

...“ఆమె నా భార్యేలెండి.” అని అతనికి సమాధానం ఇచ్చేడేగానీ, ఆ క్షణంలో అతని హృదయం ఏదో బాధతో కంపించింది. అల చెప్పినతరువాత ‘ప్రభ’ వేపు చూచేడు. ఆమె ముఖంలో తొణికిసలాడిన చిరునవ్వును గమనించేడు. అలా ఆమె తనభార్య అని రమేశం చెప్పినందుకు ఆమెమట్టుకు ఆనందించిందిగానీ, రమేశంహృదయం ప్రెస్ చేయబడినట్లు రెండు శక్తులమధ్య నొక్కుకుపోయింది!...

...“అయితే రెండువందల మైళ్లు ఈ రైలువెళ్లే పర్యంతం నిలువుజీతమే గాబోలు!” అని గొణుక్కున్నాడు రంగనాథం.

అంతసేపయి అతను వేసిన ప్రశ్నల తాలూకు తాత్పర్యం అప్పుడు బోధపడింది రమేశానికి. ఇంకా అత నలా నిలబడేఉంటే ఊరికినే చొప్పదంటుప్రశ్నలు వేసి తనను బాధిస్తాడనే ఉద్దేశంతో, ప్రభకూ తనకూ మధ్యనున్న రగ్గు తీసి తను ప్రభ వేపు జరిగి, “పాపం, ఎంతసేపని నిలబడతారు!...ఇలా కూర్చోండి రంగనాథంగారూ!” అని రమేశం అన్నాడు.

“థ్యాంక్స్!...”అని అంటూకూర్చొని—, “మీకు పిల్లలు ఇంకా...”అని రమేశం ముఖంవేపూ, ప్రభముఖంవేపూ చూచేడు రంగనాథం.

మాబాగా దాపరించేడని రమేశం అనుకున్నాడు. ఏమని చెప్పడం?...అడిగిన వెంటనే సమాధానం చెప్పకపోతే బాగుండదని, “లేరండీ!” అని చెప్పి ప్రభవేపు చూచేడు. ప్రభ కొంచెం కొంచెంగా ఒక్క రమేశం చూచేలా మాత్రమే నవ్వింది. ప్రభ ఒక్కర్తిమాత్రమే చూచేటట్లు రమేశం కూడా నవ్వేడు. కానీ రమేశం హృదయపూర్వకంగా నవ్వలేదు. నిజానికది నవ్వే కాదు! ప్రభ సంతుష్టి చెందుతుందని, అలా నవ్వినట్లు నటించేడు!!.........

రమేశంనిజంగా, శాస్త్రోక్తంగా తాలికట్టి వివాహమాడిన భార్య ఉమనీ, పిల్లల్నీ మరచిపోయి తననే భార్యగా భావిస్తున్నాడనీ, తనే సర్వస్వం అని నమ్ముతున్నాడనీ ప్రభ ఎంతోమురిసిపోయింది. తనను “నాభార్య” అని ఆ పెద్దమనిషితో చెప్పడంవల్లా, “పిల్లలా?” అని అడిగినప్పుడు, “లేరని!” ధైర్యంతో జంకూ గొంకూ లేకుండా చెప్పడంవల్లా, రమేశం పూర్తిగా ఉమనీ, పిల్లల్నీ మరచిపోయుంటాడని పరమానందభరితురాలయింది ప్రభ!...ఆ రైలు అలా తనను ఎన్నెన్నో ద్వారాలు దాటించేసి ఆఖరికి స్వర్గద్వారం గూడా దాటించేస్తున్నదని భావించుకుం దామె. ఇక తనజీవితంలో విచారానికీ, దుఃఖానికీ తావులేదని మురిసిపోయింది!... కానీ,... రమేశంనాలికచివరినుండి వెలు

వస్తున్న ఆ మాటలను విని, ఆ ముఖకవళికలను వీక్షించకలిగింది గాని,...రంగురంగుల తెరఅవతల అవని ఆత్మ ఉండే చీకటిగదిలో, విచారం, దిగులు, బెంగ, భయం, జాలి అనేవి ఎలా ప్రళయతాండవం సల్పుతున్నాయో చూడలేకపోయింది!— ఏవేవో ఊహా చిత్రాలు చిత్రించుకుంటూ అలా బల్లకు చేరబడి, పక్కకుపోతున్నట్లు కనిపిస్తున్న ఆ కొండలవేపూ, చెట్లవేపూ చూస్తూ కూర్చుంది.

శబ్దం మారింది!... రైలు బ్రిడ్జిమించి వెళుతున్నాదని చటుక్కున గ్రహించేసేడు. ఏ మాత్రం పెద్దదుందో చూద్దామని కిటికీలోంచి బుఱ్ఱమార్చి క్రిందికి, ప్రక్కలకూ చూచేడు రమేశం. అంతలో అకస్మాత్తుగా ఓ బొగ్గు రవ్వ ఎగిరొచ్చి కంట్లో పడింది. భగ భగా కన్ను మండి, కర కరలాడింది. పాకెట్ రుమాలుతో కంట నొక్కేడు. వెలికిరవ్వనుతీసేద్దామని ప్రయత్నించేసినా కాని రాలేదు. కన్ను చింతనిప్పులా తయారయింది!...

..."రుమాలుని ఉండలా చేసి, నోటిదగ్గరుంచి ఆవిరిచే వేడిచేసి కంటిని దానితో ఒత్తండి. అప్పుడది పోవచ్చు" అని ప్రభ సలహా ఇచ్చింది.

"కళ్లు బాగా తెరచేసి, కొంతసేపు రెప్ప వెయ్యకుండా అలా కూర్చోండి. అదేకన్నీటితో వచ్చేస్తుంది" అని ప్రక్కనుకూర్చున్న రంగనాథంగారు సలహా ఇచ్చేరు.

ఇద్దరు చెప్పినట్లూ చేసేడు గానీ రాలే దా రవ్వ!...అఖరికి విసిగి కిటికీమీద, వాణీ ఉంచి, దానిమీద ముఖం ఆనించి పక్కకు తిరిగి కళ్లు మూసుకొని కూర్చున్నాడు రమేశం. కన్నీళ్లు కారడంచేత వాణీ చాలావరకూ తడిసిపోయింది! ... అంతలా కళ్లంట నీళ్లు కారుతాయనుకోలేదు రమేశం!...అయితే.. ఒకటి అరకంగా కన్నీళ్లు ఎన్ని కారినా ప్రమాదం లేదు.......మరోరకంగా...?...

అతనేదో భ్రాంతిలో పడ్డాడు. ఏవేవో మానసిక బింబాలు ప్రత్యక్షమయేయి!...తన స్వంతం ప్రభ ప్రక్కను రైలులో ఉన్నట్లు అతనికి స్మృతే లేదు!!...ఉమ తనకళ్లెదుట ఉన్నట్లు భ్రమించేడు!......ఆమె ఏడుస్తున్నాది. బొట బొటా కళ్లంటనీరు కారుస్తున్నాది. ఆ కన్నీటితో ఆమె చీర తడిసిపోయింది. ఒడిలో ఉన్న చిట్టిబాబుముఖం మీద ముఖం పెట్టి బాబుని ఆ కన్నీటితో తడిపేస్తున్నాది....వెళ్లిపోయేడు. చిట్టిబాబు వెళ్లిపోయేడు!! ఒట్టి అమాయకురాలు ఏం చెయ్యగలదు?!...ఏడవడం తప్ప మరేమి చెయ్యగలదు?...అయితే ఆమె కళ్లంట కారే కన్నీళ్లు సాధారణ మయినవి కావు!...విచారం, బాధ, దుఃఖం, దిగులు, క్రోధం అన్నీ ఆ కన్నీళ్లలో సమ్మిళితం చేయబడ్డాయి...

రమేశం ఇంకా అలా భ్రాంతిలో ఉంటూ ఉండగానే, ప్రక్కనున్న రంగనాథం గారు అతన్ని తట్టి, "ఏమండోయ్, వాణీ జారి పోతున్నాది." అని చెప్పేసరికి తిరిగి వాస్తవికజగత్తులోకి వచ్చేడు రమేశం!—తను రైలులో ప్రభ ప్రక్క నున్నట్లు గుర్తించేడు. కానీ, ఉమమాత్రంమనస్సులో అలా నిలచే ఉంది. నిజంగా ఉమ అంతలా ఏడుస్తుందా?" అని తనలో తానే ప్రశ్నించుకొని, మళ్ళీ కిటికీమీద ముఖం పెట్టి ఆలోచించడం మొదలుపెట్టేడు. — ఎందు కేడవదు?...జబ్బుతో ఉన్న కొడుకునీ, తనే సర్వస్వం అని నమ్ముకొని ఉన్న ఆ ఉత్తమఇల్లాలు ఉమని విడిచి వచ్చేయడం అనేది మంచిపనేనా? తనెంత ద్రోహం ఆమెకు చేస్తున్నాడు!...ఆమె ఏం తప్పు చేసిందంటకి. తను ప్రభతో ఆనందంగా కులుకుతూఉన్నప్పుడు ఓర్చున ఉమ



చూచింది కానీ, పల్లెత్తుమాటయినా అందా? ...లోకంతో ఆ విషయం చెప్పిందా? లేదే! ...."ఆనందాన్ని అరికట్టడం మహా దోషం!" అంది ఎంతో శాంతంతో. ఆమె అంత మంచిదవడమే ఆమె తప్పు!...ఆనాడే లోకంముందు ఆ విషయాన్ని బహిరంగపరిచి నట్లయితే, తను అప్పుడలా ప్రభతో లేచి వచ్చేసేవాడు కాదేమో!...ఎంత మంచి హృదయం ఆమెది. లేకపోతే ఏ ఆడదయినా భర్త మరో స్త్రీతో కులుకుతూ సరసాలాడుతూ ఉంటే చూచి సహిస్తుందీ?..."ఆనందాన్ని అరికట్టకూడదు." అని ఆ సందర్భంలో అనేవాళ్లు పిచ్చివాళ్లు కాక మరేమిటి? ...పాపం, ఎలా ఉందో ఆ అమాయకురాలు ఉమ!...ఎలా ఉంటుంది?...ఏడుస్తుంది, కళ్లు ఎండిపోయేలా ఏడుస్తుంది. జబ్బుతో ఉన్న పిల్లడెలానూ చచ్చిపోతాడు. అప్పుడు పిచ్చెత్తిపోతుంది. ముష్టెత్తుకుంటూ వీథుల్లో తిరుగుతుంది. ప్రభతో తను కులుకుతూ సరసాలాడుతూ ఆనందంగా ఉన్న సమయమప్పుడు తన కృశించిన చెయ్యి చాచి ముష్టి వెయ్యమంటుంది!... ఆ దృశ్యం తల్చుకోనేసరికి రమేశం హృదయం గడ్డకట్టుకుపోయింది. కళ్లంట చాలా నీరు కారింది. ఈ మారు నలుసువల్ల కాదు. దుఃఖాన్ని ఆపుకోలేకపోవడం చేత!...

తలఎత్తి కిటికీలోంచి చూచేడు. సాయంత్రం కనుమూసింది. ఉన్న కొత్త వెలుతురూ మాయమయేలా నాలుగు మూలలనుంచీ కారు మేఘాలు కమ్ముకొస్తున్నాయి. పెట్టిలో దీపం వెలిగింది. ప్రభవేపు చూచేడు రమేశం.

"ఏం, ఇంకా నలుసు రాలేదా?...ఎంత ఎఱ్ఱగా అయిపోయిందో కన్ను" అంది ప్రభ రమేశం కళ్లలోకి చూస్తూ.

"కంటిలో నీరు పూర్తిగా అయిపోతేనే గానీ వచ్చేటట్లు లేదు!" అని, మళ్ళీ కిటికీ మీద ముఖం ఆనించి గట్టిగా కళ్లు మూసుకున్నాడు. 'మళ్ళీ ఉమదగ్గర కెళ్లిపోతేనో!' అనే ఆలోచన మెఱుపు మెరసినట్లు రమేశానికి తట్టింది! మరి ప్రభసంగతి?...ప్రభను తల్చుకునేసరికి అతని మనఃఫలకంలో ఉమ మళ్ళీ మూడు వందలమైళ్ల దూరంలో ఉంది!!


...ప్రభ తనను మనసారా ప్రేమించింది. సంఘసమ్ముఖంలో శాస్త్రోక్తంగా వివాహమాడిన భర్తను విడచి వచ్చేసింది. నీటముంచినా, పాలముంచినా సరే, తనే ఆమెకు కావలసినవాడని నమ్మింది. అరవైఏళ్ళ ముసిలి పీనుగయిన భర్త దగ్గర ఇక కష్టాలు తప్పి పోయేయని ఆనంద సాగరంలో మునిగి తేలుతున్నాది. ఎన్నో ఊహాసౌధాలు నిర్మించుకుంటున్నాది. ఇక అలా ఆమెను విడచి మళ్లీ ఉమ దగ్గరకు పోతే, ప్రభ అలా ఆరైలులోంచి దూకేయదూ?... ప్రభను విడిచి వెళ్లిపోవడం మంచిది కాదనే తీర్మానానికి వచ్చేడు.

కానీ, మళ్లీ ఉమ మనస్సులో, దిగంబరి అయి అలా వెఱ్ఱిగా కేకలేస్తూ ప్రత్యక్షమయింది. "ఇదిగో చిట్టిబాబు!...ప్రాణం లేని చిట్టిబాబు. కఱ్ఱబొమ్మ ... అహహహ..." అని వెఱ్ఱిగా కేకలేసినట్లు భ్రమించేడు. ఊహుఁ!...ఉండడానికి వీల్లేదు. పోవాలి. హహహ ఉమదగ్గరకు తక్షణం పోవాలనే తీర్మానానికి వచ్చేడు. మనస్సు మరో రంగు ధరించింది!!...

కానీ, ప్రభనలా రైలులో విడిచి ఎలా వెళ్లిపోవడం?!...ఈ బుద్ధి తనకు మొదటే ఉండవలసింది. అప్పుడు ప్రభ రమ్మన్నప్పుడే తను రాలేనన్న సంగతి చెప్పేయ్యవలసింది! ... అసలు ఆమె అరవైఏళ్ల భర్తదగ్గర తృప్తిపొందలేక తనను కామపాశంచే బంధించడం కొంతసబబే!...కానీ, చక్కని భార్య ఉంటున్నప్పటికీ తనుకూడా ఆమె వప్పుల్లో కామించడం ఎంత తెలివితక్కువపని!... ఈ బుద్ధి అప్పట్లో తనకుంటే, ఉమని విడిచిపెట్టి ప్రభతో తను ఒచ్చేసేవాడా?... సరే, తన తెలివితక్కువతనంచేత అదంతా జరిగింది.

ఇక ఇప్పుడు ప్రభని విడిచి వెళ్ళిపోవడం ఏం న్యాయం?...ఒకవేళ తను వెళ్ళిపోతే ఆమె భవిష్యత్తు ఏమవుతుంది? ...తనంటే భార్య మళ్ళిపువ్వుల్లో పెట్టి పూజచేస్తుంది. కానీ ప్రభవిషయం? ఆమెను ఆమెభర్త మళ్ళీ గుమ్మం తొక్కనిస్తాడా?...ఇక సంఘం మళ్లీ తనను యధాప్రకారంగా గౌరవంగానే చూస్తుంది కానీ, స్త్రీజాతికి చెందిన ఆమెను సంఘం ఆదరిస్తుందా? ఊహుఁ!... ఇక ఆమెకు తనే దిక్కు. ఉమను మనస్సులోంచి తరిమెయ్యాలనుకున్నాడు. కానీ లాభం లేకపోయింది!...ప్రభతో తనుండిపోతే, అవతల, ఉమ, చిట్టిబాబుల ఇద్దరి చావుకీ తను కారకుడన్నమాట! — ఉమని చేరుకుంటే ప్రభ ఒక్కర్తి చావుకే తను కారకుడనేమాట!...ఏపని చేయడం?...బాగా ఆలోచించగా ఉమదగ్గరకు పోవడమే న్యాయమనిపించింది.

ప్రభవేపు చూచేడు ముఖం ఎత్తి. బల్లకు చేరబడి నిద్దరపోతున్నాదామె!...నిదా



నించి మళ్ళీ ప్రభవేపు చూచేడు. అతనిదృష్టి, ఆమె ఉన్నత వక్షోజాలమీద లేదు. ఆ తక్కువకాంతిలో కూడా తళతళ మెరుస్తున్న ఆ పసిడిచెక్కిళ్ళపై లేదు. కలకలలాడే ఆ నగుముఖం మీదలేదు. వంకీలుతిరిగి నల్లత్రాచల్లే ఉన్న ఆ జడమీద లేదు. పరిరంభానికి ఆహ్వానిస్తున్నట్లున్న ఆ పసిడి చేతుల మీదా తొడలమీదా లేదు. సాధారణంగా ఎవ్వరూ చూడలేని స్థలంవేపు చూచెడు. అదే ఆమె ఆత్మ ఉండే చీకటిగది!- ధైర్యం, సాహసం. జీవితంమీద ఆశ. కామం, విచారం, ఈర్ష్య, కోపం...ఇంకా ఎన్నెన్నో కనిపించేయి. ఫరవాలేదు !...ధైర్యమయిన మనిషే ననుకున్నాడు. స్టేషను వచ్చింది, ఆగింది చప్పుడు !...పెనక్కు వెళ్లుతున్న మరో రైలుకూడా ఆ స్టేషనులో ఉంది. ప్రభ ఇంకా నిద్దరపోతూనే ఉంది. "ఇప్పుడే వస్తానండీ! ఈ పెట్టె లెట్రిన్‌లో నీళ్లు లేవుట మరోపెట్టెలోకి వెళ్ళివస్తాను. మాప్రభ లేస్తే "అలా వెళ్ళేరు. వస్తార'ని చెప్పండి" అని రంగనాథం గారితో చెప్పి, దిగి ఆ ప్రక్క రైలులో ఓకొసా పెట్టె దగ్గరకుపోయి ఎక్కేడు. తనప్పుడుదిగివచ్చిన రైలే ముందుబయలు దేరింది. మళ్ళీ చప్పుడు గుండెల్లో దడదడ!! కనుచూపుమేర రైలు వెళ్ళిపోయే వరకూ చూచేడు. ప్రభచాలా దూరమయింది. అప్రయత్నంగా కన్నీరు కారింది. ఆ నీటితోపాటు అదివరకు కంట్లోపడ్డ రాక్షసిబొగ్గు రవ్వ కూడా వచ్చేసింది.

* * *

"డాక్టరుగారూ!...ఎలా అయినా రక్షించాలి !—మీకు పుణ్యం ఉంటుంది. నాచిట్టిబాబుని బ్రతికించండి. మీఋణం జన్మజన్మాలకీ తీర్చుకోలేను...రక్షించండి." అని డాక్టరు కాళ్లు పట్టుకుని ఉమ బ్రతిమాలుతున్న సమయంలోనే గదిలోకి తొందర తొందరగా ప్రవేశించేడు రమేశం.

రమేశాన్ని చూడ్డంతోనే, "అమ్మోవ్! రాక్షసుడు మళ్లీ ఒచ్చేడు" అంటూ డాక్టర్ని కౌగలించుకుంది ఉమ.

నిర్ఘాంతపోయి, అలా నిలబడి పోయేడు రమేశం. ఏమనాలో, ఏం చెయ్యాలో అర్థమయింది కాదతనికి. "నేనుఉమా!...నీభర్తని! అదేం అలా భయపడుతున్నావు?" అన్నాడు భయాశ్చర్యాలతో,

నువ్వు నాభర్తవా?...కావు రాక్షసుడివి!! నాజీవితం పాడుచెయ్యడం చాలక ఆ ప్రభ జీవితం కూడా పాడుచేసేవ్!- దాన్ని ఏం చేసేవు, చంపేశావా? రాక్షసుడా? ఈ ఇంట్లోంచి మొదట ఫో!" అంది ఆవేశంతో ఉమ.

అలా కట్టబొమ్మలా ఉండిపోయేడు రమేశం. తన తెలివితక్కువ ప్రవర్తనవల్ల ఉమ మనస్సు పూర్తిగావిరిగిపోయిందనుకున్నాడు. "ఉమా క్షమించు. పొరపాటు చేసేను. ఇక నాయీ పాడుముఖాన్ని లోకానికి చూపెట్టనులె!" అని అంటూ చిట్టిబాబుమంచం దగ్గరకువెళ్లి, బాబుని ముద్దులాడి, బరువుగా, అడుగులు వేస్తూ వీధివేపు బయలుదేరేడు.

ఆదృశ్యాన్నంతటినీ చూచి నిశ్చేష్టుడయి పోయేడు డాక్టరు.

వీధిగుమ్మం దాటుతున్న భర్త దగ్గరకు పరుగెట్టి అడ్డంగా నిలబడి, "మీరు వెళ్ళడానికి వీల్లేదు. చిట్టిబాబును బ్రతికించండి." అని అంటూ కాళ్ళమీదపడి బావురుమని ఏడ్చింది ఉమ!...ఏమనాలో అర్థంకాక, ఆమెనులేవనెత్తి, కౌగలించుకొని తనూ బావురుమని, ఏడవడం తప్ప అప్పట్లో మరేమీ చెయ్యలేక పోయేడు రమేశం.

డాక్టరుదగ్గరకు పరిగెట్టేడు రమేశం. ఆయనముఖంకేసి బెంగతో చూచేడు. "మరేం పరవాలేదు. ఈ కుఱ్ఱాడు బ్రతుకుతాడు...ఔనుగానీ, ఇంతసేపయి జరిగిన తతంగం నాకేమీ అర్థంకాలేదు. ఏమిటిదంతా?" అని డాక్టరడిగేడు,

"ఏం చెప్పగలను? అదంతా ఓ మరువలేని గాథ!... ఆలోచించకుండా తెలివితక్కువతనంగా చేసిన తొందరపనిఫలితం ఇదంతా!- ఆలోచించకుండా, తాత్కాలి కానందం కోసం ఇలా తొందరపడి పాలా చేసేవాళ్లు జీవితాంతంవరకూ ఏ సుఖాన్నీ పొందలేరు. ...అనవసరంగా ఒకరిచావుకు కారణమయేను డాక్టరుగారూ!..." అంటూ డాక్టరుకాళ్ళను పట్టుకొని కన్నీళ్ళు కార్చేడు.

"ప్రభ చచ్చిపోయిందా?" అని ఆందోళనతో అడిగింది. ఉమ.

"నేనామెను రైలులో విడిచిపెట్టి వచ్చేసరికి, చనిపోలేదు. ఈపాటికి చచ్చిపోయే ఉంటుంది." అన్నాడు రమేశం.

"ఆ!... మీతో లేచివచ్చేసింది, ఆప్రక్కనున్న మరొకరిని వలలో వేసుకొని వాడితో పోదుటండీ?!... మీ పిచ్చిగానీ!..." అని అన్నాడు డాక్టరు వెటకారంగా నవ్వుతూ.

చటుక్కున రంగనాథం జ్ఞాపకానికి వచ్చేడు. ప్రభ అతనిఅండ చేరుంటుందా అనిఅనుమానం వేసిందిరమేశానికి. కానీ ప్రభ అలాంటిది కాదని రమేశంఅభిప్రాయం.

"డాక్టరుగారన్నట్లు ప్రభ మరొకరితో పోయుంటుంది. దానికేం?" అంటుంది ఉమ.

ప్రభ ఆత్మహత్య చేసుకొనిఉంటుందని రమేశం అభిప్రాయం!.... ఆ రైలులో అలా ఆమె మరోలోకానికి ప్రయాణం చేసేస్తుందని అతని అభిప్రాయం. ★

# ఏమీ తోచక

### శ్రీ వల్లభనేని నారాయణరావు

★

ఏమీ తోచక
ఏదో రాస్తే
ఏమో వుందని
చదివే చదువరి
ఏమీ లేదని
యెరుగంగానే
యేమంటాడో
యేమోగానీ
ఏమీ రాయక
ఎట్టుండాలో
యేమీతోచక
ఇది రాస్తున్నా.
మొన్నా నిన్నా
అన్నం లేకా
ఉన్నది కాస్తా
నిన్నటి వరకూ
అప్పుడప్పుడూ
అరటిపళ్ళకై
ఇచ్చేస్తుంటే
ఖర్చయి పోతే,
కానీకూడా
కరువైపోతే,
ఉదయంనుంచీ
ఉపవాసంతో
గడిపిన వాడిని
కలం పట్టుకుని
ఏమో అనుకుని
ఏదో రాస్తే
ఏమో వుందని
చదివేచదువరి
ఏమంటాడో

ఏమోగానీ
రాయాలంటే
రాందే యెట్లా?
మనలోమనకో
మాట చెప్పతా-
నిన్నటినుంచీ
అన్నం లేకా,
నిస్సత్తువతో
నే చస్తుంటే
నాపై పెపుడై
నా, చూచావా?
బుక్కు కొనుక్కుని
వక్క నములుతూ,
పక్కజేరుకుని
పడుకోబోతూ,
తిన్నది అరగక
తేపు తేపుతూ,
బుక్కు తెరచుకుని
ఇక్కడ చూస్తూ,
ఏమీ లేదని
యెగిరేకంటే,
ఇంతకుముందే
ఇది రాసిన, నా
సంగతి తెలుసుకు
సహాయపడితే
ఏదైనా, కొం
తిక్కడ కనపడి
చదివినవాడివి
సంతోషంతో
కునికే ముందర
కులికే పనిగా!

★